క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన లావణ్య



మంగళగిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పార్టీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య కోరారు. పట్టణంలోని లావణ్య నివాసంలో బుధవారం నవులూరుకు చెందిన పలువరు యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన లావణ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసి, జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలని కోరారు. జగనన్న చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రుద్రు నరేంద్ర యాదవ్, పెద్దిబోయిన కార్తీక్, మర్రి సాంబ, బత్తుల అశోక్, మర్రి గౌతమ్, షేక్ బన్ను, రుద్రు శ్రీను తదితరులున్నారు.

భక్తులకు క్రీస్తు పునరుత్థాన ఆశీర్వాదాలు



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని రాజాపేట, రసూల్‌పేట, కొత్తపేట, కొండమెట్ల బజార్, తూర్పుబజార్ ప్రాంతాల్లో బుధవారం క్రైస్తవులకు క్రీస్తు పునరుత్థాన ఆశీర్వాదాలు బాల ఏసు దేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి, మరికొందరు ఫాదర్లు అందజేశారు. క్రైస్తవ భక్తుల ఇంటింటికి ఫాదర్లు వెళ్లి వారిని పరిశుద్ధ జలంలో ఆశీర్వదించారు. దీనిద్వారా ఆయా కుటుంబాల్లో సంతోషాలు వెల్లువిరుస్తాయని, క్రీస్తు ఆశీస్సులు ఎల్లప్పుడు వారికి ఉంటాయని చెప్పారు. ఫాదర్లు ఆర్.అనిల్ కుమార్, విలియమ్, వినోద్, చంద్రశేఖర్, డీకన్ బాల, డీకన్ జీవన్‌లు ఉన్నారు.

అడ్డరోడ్డులో రూ.2.90 లక్షల నగదు స్వాధీనం

ద్విచక్ర వాహనంపై తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు



తాడికొండ: ఎలాంటి బిల్లులు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ. 2.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. ఎస్ఐ రవీంద్ర బాబు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన షేక్ జానీబాషా తన బైక్‌లో రూ.2.90 లక్షల నగదు పెట్టుకొని వెళుతున్నాడు. విచారించగా అందుకు సంబంధించిన ఎలాంటి బిల్లులు లేవని తెలిపిన నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నగదును ఐటీ అధికారులకు స్వాధీనం చేయనున్నట్లు సీఐ తెలిపారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మూడు వార్డుల్లోని నాయకులు, కార్యకర్తలతో గురువారం సాయంత్రం నిర్వహించే ఆత్మీయ సమావేశంలో మాజీ హోం శాఖ మంత్రి, ఎమ్మెల్యే, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయా వార్డుల్లోని ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

జవహర్ నవోదయకు దుగ్గిరాల విద్యార్థి ఎంపిక



విద్యార్థి హనీష్ (ఫైల్)

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన ఓ విద్యార్థి జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు బుధవారం వెల్లడించారు. మంగళగిరి రూరల్ నూతక్కిలో వున్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఎం. హనీష్ నవోదయ పరీక్షలకు హాజరయ్యాడు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణుడైన హనీష్ నవోదయకు ఎంపికయ్యాడు. తండ్రి మేలం సురేష్‌బాబు, తల్లి అనిత తమ కుమారు హనీష్ జవహర్ నవోదయ పరీక్షల్లో ఉత్తీర్ణుడై ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

పండుటాకులపై ఇంత పగా?!

చంద్రబాబుపై పింఛన్ లబ్ధిదారుల ఆగ్రహం

- పింఛన్ల కోసం ఉదయాన్నే సచివాలయాల వద్దకు చేరుకున్న వృద్ధులు
- ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన అధికారులు



పింఛన్ల కోసం మంగళగిరి 5వ నంబరు సచివాలయం వద్ద ఉదయాన్నే వేచి ఉన్న వృద్ధులు, లబ్ధిదారులు

మంగళగిరి/ఫిరంగిపురం: నడవలేక, మంచాలకే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులపై ఇంత క్రూరత్వంగా ప్రవర్తించి పింఛన్లు పంపిణీని టీడీపీ నాయకులు, చంద్రబాబు అడ్డుకోవడం సమంజసమేనా అని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకుని తమను ఇన్ని ఇబ్బందులకు గురిచేసిన చంద్రబాబుకు, టీడీపీ రానున్న ఎన్నికలలో తమ సత్తా ఏమిటో చూపిస్తామంటున్నారు. బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలుసుకున్న లబ్ధిదారులు ఉదయమే ఆయా సచివాలయాల వద్దకు చేరుకుని, పింఛన్లు అందుకున్నారు.

చంద్రబాబు నిర్వాకం కారణంగానే తిప్పలు..



ఇప్పటిదాకా వలంటీర్ ఒకటో తేదీ ఇంటికి వచ్చి పింఛను ఇవ్వడంతో ఆనందంగా ఉన్నాం. మూడు రోజులుగా పింఛను కోసం ఎదురు చూడగా ఇంటికి వలంటీర్ రాలేదు. చంద్రబాబు ఫిర్యాదు కారణంగానే సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకోవాలని నా మనుమరాలు చెప్పింది. ఒక్క దాన్నే రాలేక మనమరాలిని తోడు తీసుకుని వచ్చి పింఛను తీసుకున్నాను. పింఛను కోసం ఇద్దరం తిరగాల్సి రావడమే కాక, ఆటో చార్జీలు అదనపు ఖర్చు. చంద్రబాబు నిర్వాకం కారణంగానే మాలాంటి వృద్ధులకు ఇబ్బందులు వచ్చాయి. రానున్న ఎన్నికలలో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలంటే ఇంటికి పెద్ద కొడుకు జగన్‌బాబుకే ఓటేయాలని అందరికీ చెబుతాను.

– షేక్ రహమున్నీసా, మంగళగిరి

చంద్రబాబును ఇక ఎప్పటికీ నమ్మరు..



కర్ర ఊతం ఉంటేనేగానీ నడవలేని మాలాంటి వారి కోసమే సీఎం జగన్ ఇంటి వద్దకు వలంటీర్లతో పింఛను పంపిస్తున్నాడు. మాలాంటి వారి కష్టాలు తెలుసుకోలేని చంద్రబాబు నాయకుడుగా పనికిరాడు. పేదలు, వృద్ధులు, దివ్యాంగుల కష్టాలు తెలుసుకున్న మనస్సున్న నాయకుడిగా జగన్‌బాబు ప్రజల హృదయాలు గెలుచుకుంటుంటే చంద్రబాబు మాత్రం పేదలు, వృద్ధులు, దివ్యాంగుల కష్టాలు పట్టించుకోక ప్రజలకు దూరమయ్యాడు. చంద్రబాబును ప్రజలు ఇక ఎప్పటికీ నమ్మి ఓట్లు వేయరు.

– అన్నపురెడ్డి సాంబయ్య, కొత్తపేట, మంగళగిరి

మమ్మల్ని మళ్లీ రోడ్డుపైకి తెచ్చాడు..



మూడవ వార్డులో ఉంటున్నాను. పింఛను 5 వ వార్డు సచివాలయంలో ఇస్తారు. కిలోమీటరు పైగా దూరం వుంది. ఎండల్లో నడిచి రావాలంటే రాలేక.. ఆటోలో రావాల్సి వచ్చాను. ప్రశాంతంగా ఇంటికి వచ్చే పింఛన్లు ఆపిన చంద్రబాబు మమ్మల్ని మళ్లీరోడ్డుపైకి తెచ్చాడు. మాకు మేలు చేసే జగన్ బాబుకు ఓట్లేసి మళ్లీ సీఎంగా చేసుకుంటాం.

– సూర్యనారాయణ, మంగళగిరి

చంద్రబాబు ఎవరికీ మేలు చేయడు..



చంద్రబాబు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు మేలు చేయడు.. అధికారంలో ఉన్నపుడు పింఛన్లు ఇంటికి పంపకపోగా కార్యాలయాల చుట్టూ తిప్పి ఇబ్బందులు పెట్టే వాడు. ఇప్పుడు కూడా ఇబ్బంది పెడుతున్నాడు. పేదలన్నా పింఛన్లపై ఆధారపడి బతికే వారన్నా చంద్రబాబుకు చులకన భావం. నేను నడవలేక నా కొడుకు బండిపై పింఛన్ కోసం వచ్చాను.

– కోదూరి సీతామహాలక్ష్మి, మంగళగిరి

తెల్లవారక ముందే పింఛన్ ఇచ్చేవారు



ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారక ముందే వలంటీర్ ఇంటికి వచ్చి తలుపుకొట్టి మరీ పింఛన్ ఇచ్చేవాడు. పాతరోజులు బాగున్నాయి. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ వస్తేనే మా బాధలు పోతాయి. గంటల కొద్ది నిలిచే పరిస్థితి తప్పుతుంది.

– కె.వెంకాయమ్మ, ఫిరంగిపురం

నడవలేని పరిస్థితి ..



గతంలో ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. మళ్లీ ఆరోజులు వస్తేనే మాలాంటి వారి కష్టాలు తీరుతాయి. ఇప్పుడు సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాలంటే నడవలేని పరిస్థితి. వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చిన రోజులే బాగున్నాయి.

– బి.శ్రీను, వేములూరిపాడు

అన్నివర్గాలకు సంక్షేమం చేరువ చేసిన జగనన్న

- వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత
- లింగాయపాలెంలో ఎన్నికల ప్రచారం



లింగాయపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

లింగాయపాలెం(తాడికొండ): కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. తుళ్లూరు మండలం లింగాయపాలెం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాదరంగా ఆహ్వానించడంతో సందడి వాతావరణం నెలకొంది. గ్రామస్తులతో మమేకమైన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అందరినీ ఆప్యాయంగా పలకరించి ఓట్లు అభ్యర్థించారు. గ్రామస్తులు చెప్పే సమస్యలను సానుకూలంగా విని పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మేనిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా తీసుకొని నూరుశాతం హామీలు అమలు చేసిన జగనన్న మీకు మంచి జరిగిందంటేనే ఓటు వేయండని ఎన్నికలకు వస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనని, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, వివిధ విభాగాల రాష్ట్ర నాయకులు బుర్రా వెంకట శివారెడ్డి, శృంగారపాటి సందీప్, చలివేంద్రం సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు నాగేశ్వరరావు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ల అధ్యక్షుడు తుమ్మూరు రమణారెడ్డి, సొసైటీ చైర్మన్లు ఆలూరి శ్రీనివాసరావు, మున్నంగి కోటిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఐనవోలు చంటి, మండల సోషల్ మీడియా కన్వీనర్ ఐనవోలు సుధీర్, వివిధ విభాగాల నాయకులు చనుమోలు రామారావు, అన్నూరు జక్రయ్య, పులి సురేష్ కలపాల ప్రభుదాసు, ఆనంద్, వెంగళరెడ్డి, ఆలోకం సురేష్, దానం వినోద్, ఆరేపల్లి జోజి, కొప్పుల ఆంద్రీయప్ప పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడికొండలో ..

మండల కేంద్రమైన తాడికొండ 15, 16 వార్డుల్లో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ తిరిగి ఎన్నికల్లో తన తల్లి మేకతోటి సుచరిత ఎమ్మెల్యేగా, ఎంపీగా కిలారి వెంకట రోశయ్య పోటీ చేస్తున్నారని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శివదుర్గాపురంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్ అంబేడ్కర్ కాలనీలో వున్న అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం శివదుర్గాపురంలో ఆరోగ్య సురక్ష – 3 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మానస పర్యవేక్షణలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్ డాక్టర్లు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించామని, ఈ కార్యక్రమంలో 270 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో శిబిరానికి విచ్చేశారని, వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని, ఇద్దరికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉండడంతో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి సిఫార్సు చేశామని ఆమె తెలిపారు. ఆసుపత్రి సిబ్బందితో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరులో, పట్టణంలోని ఇందిరానగర్ సైదమ్మ కొట్టు ఏరియాలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, నూతన స్తంభాల ఏర్పాటు కోసం విద్యుత్ సరఫరాలో జరుగుతున్న ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ముసుగులు తొలగించాలి

- కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలి
- డిమాండ్ చేసిన బహుజన నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బహుజన నాయకులు

మంగళగిరి: సమాజంలో పేద బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాడిన మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఈ నెల 5వ తేదిన ఘనంగా జరుపుకోవాలని బహుజన నాయకులు కోరారు. పట్టణంలో ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు శావల థామస్, ఈపూరి ఆదామ్‌లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహాలకు వేసిన ముసుగులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5 వ తేదీన పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిర్వహించే జయంతి కార్యక్రమంలో బహుజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బాబూ జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. బహుజన నాయకులు జాలాది నాగేశ్వరరావు, కుంచాల కృష్ణ కిషోర్, వడ్డేశ్వరపు రజనీకాంత్, మీనిగ ఆంజనేయులు, పులివర్తి రాంబాబు, సాలి ప్రశాంత్, చిలకా విక్టర్ ఇమ్మానుయేలు, బండపల్లి బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

తెనాలి రూరల్: సంగం జాగర్లమూడి శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎక్కువ మంది పాఠకులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవటంతో పాటు గ్రంథాలయాన్ని వినియోగించుకునే విధంగా చేయాలని గ్రంథాలయాధికారి జమ్ముల వెంకటేశ్వరరావును ఆదేశించారు. గ్రంథాలయ సేవలు అందుతున్న తీరుపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణం చేపట్టడానికి స్థల సేకరణ కోసం ప్రయత్నం చేయాలని గ్రంథాలయాధికారిని ఆదేశించారు.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: పలు చోరీ కేసుల్లో నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్ఓ విజయచంద్ర బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన కోనూరి శ్రీనివాసరావు గతంలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ దొంగ బంగారం విక్రయించి పెట్టడంతో ఓ వ్యక్తికి సహాయపడి అరెస్టు అయి జైలుకు వెళ్లాడు. 2023 సెప్టెంబరులో మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో, అదే నెలలో గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో, 2024 మార్చిలో పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో చోరీలు చేశాడు. అదే నెలలో పొన్నూరు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు చోరీలు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం నిందితుడు శ్రీనివాసరావును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ద్విచక్రవాహనం, 39 గ్రాముల బంగారు, 353 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు.

బ్రహ్మయ్య హత్యకేసు నిందితులను కఠినంగా శిక్షించాలి

దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్



మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్

మంగళగిరి: పేద బడుగు బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు నాదెండ్ల బ్రహ్మయ్యను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యా వరప్రసాద్, ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని టిప్పర్ల బజార్‌లో నాదెండ్ల బ్రహ్మయ్యను హత్య చేసిన చంద్రం ముఠాను అరెస్ట్ చేసి శిక్షించాలంటూ జరుగుతున్న దీక్షలను బుధవారం వారు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మయ్య హత్య కేసులో నిందితులను ఇంత వరకు అరెస్ట్ చేయకపోవడంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావు, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, భగత్ సింగ్, విరసం నాయకుడు అరుగుమిల్లి కృష్ణ, పీడీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకుడు ఎం.రవి, సీపీఐ నాయకుడు కంచర్ల కాశయ్య, భారత్ బచావో నాయకులు కోలు నవజ్యోతి, దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు నతావబరం, పాగళ్ల ప్రకాష్, తాడికొండ నరసింహారావు, సాధు మాల్యాద్రి, పాటిబండ్ల కోటేశ్వరరావు, బత్తుల విల్సన్, బత్తుల వరుస్వామి, ముత్తయ్య, సీపీఐ న్యూడెమోక్రసి నాయకులు యెటుర్రి నరసింహారావు, తిరుపతయ్య, శిఖా సురేష్, అన్నవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు బీసీ మహిళలంటే చులకన భావం

- కోవిడ్ సమయంలో తండ్రీ, కొడుకులు ఎక్కడ దాక్కున్నారు ?
- నారా లోకేష్‌పై మండిపడ్డ వైఎస్సార్ సీపీ బీసీ మహిళలు

మంగళగిరి: టీడీపీ మంగళగిరి అభ్యర్థి నారా లోకేష్‌కు బీసీ మహిళలంటే అలుసని, కాబట్టే ఆ పార్టీలోని బీసీ మహిళా నేతల ముసుగులో 'ఐటీడీపీ' వారితో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యపై విమర్శలు చేయిస్తున్నారని పలువురు బీసీ మహిళా నాయకులు మండిపడ్డారు. బుధవారం ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో జరిగిన సమావేశంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకురాలు పాలేటి కృష్ణవేణిలు మాట్లాడుతూ చెట్టుపేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే రకం లోకేష్ అన్నారు. దివంగత ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించి చంపించిన చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు ఇప్పుడు ఎన్టీఆర్ బొమ్మ పెట్టుకోవడానికి సిగ్గు లేదా అని నిలదీశారు. బీసీ మహిళల పేరుతో ఐ టీడీపీ వారితో బీసీ మహిళ అయిన వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆర్కేను విమర్శించడం లోకేష్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్యాలు వల్లెవేసినంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవద్దని హితవు పలికారు. కోవిడ్ సమయంలో లోకేష్ ఆయన తండ్రి చంద్రబాబు ఏ కలుగులో దాక్కున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆర్కేను విమర్శించడమంటే ఆకాశం మీద ఉమ్మి వేయడమేనని గుర్తించుకోవాలన్నారు. బీసీ మహిళల మీద విమర్శలు చేస్తూ లోకేష్ తన అగ్రకుల దురంహంకారాన్ని చాటుకుంటున్నారని ధ్వజమెత్తారు. లావణ్య తన కుటుంబానికి వున్న ఆర్థిక స్థోమత బట్టి ఉన్నత చదువులు చదుకున్నారని, లోకేష్‌లాగా పుట్టుకతోనే అవినీతి డబ్బుతో అమెరికాలో చదువుకోలేదన్నారు. ఐదు సంవత్సరాలు అధికారంలో చంద్రబాబు, అప్పుడు మూడు శాఖల మంత్రిగా ఉన్న లోకేష్‌లు మంగళగిరికి చేసిన ఒక్క అభివృద్ధి పనైనా చెప్పగలరా అని నిలదీశారు. లోకేష్, చంద్రబాబులు ఎన్ని కుయుక్తులు, కుట్రలు పన్నినా మంగళగిరిలో బీసీ మహిళ చేతిలో ఓటమి తప్పదని స్పష్టం చేశారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి
- నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్



ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రవికాంత్

తాడేపల్లిరూరల్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ అన్నారు. బుధవారం రాత్రి తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవికాంత్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునేటప్పుడు ఎవరైనా వ్యక్తులు ప్రభావితం చేసినా, బెదిరింపులకు పాల్పడినా అటువంటివారి సమాచారం ఇవ్వాలని, ఓటు హక్కు వున్న ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే హక్కు ఉంటుందని, ఎవరి బలవంతం వల్లో మీ ఓటు హక్కును మీకు ఇష్టం లేకుండా వేరేవారికి వేయవలసిన అవసరం లేదని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిని ఇప్పటికే బైండోవర్ చేశామని, అలాంటి వారు ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలు పడినా సహించేది లేదని, ప్రతి పోలింగ్ బూత్ దగ్గర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన అన్నారు.

పోలీసుల కవాతు..

తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలకంపాడు, పట్టాభిరామయ్య కాలనీ ప్రాంతాల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలీసులు కవాతు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ఎస్ఐలు ప్రతాప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానాభివృద్ధి



ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త నాగేశ్వరరావును సత్కరిస్తున్న రామకృష్ణమూర్తి, ఐజక్ ప్రసాద్, సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇన్నోవేషన్ ఫెయిర్–2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సృజనాత్మక ఆలోచనలు కచ్చితంగా ఉంటాయని, వాటిని వెలుగులోకి తీసుకురావడంలో ఇటువంటి సాంకేతిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి పరచి, నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించడంలో కళాశాలల యాజమాన్యాలు కృషి చేయాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు వివరణాత్మక, విశ్లేషణ సామర్థ్యం ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ ఫెయిర్‌లో భాగంగా ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కన్వీనర్ ఎస్. కృష్ణార్జునరావు, కో–కన్వీనర్లు ఐ. నాగాంజనేయులు, కె. సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వృద్ధురాలికి గాయాలు

తెనాలిరూరల్: అపార్ట్‌మెంట్ నుంచి పడి వృద్ధురాలు తీవ్ర గాయాల పాలైన ఘటన తెనాలిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేటలోని అష్టలక్ష్మి గుడి పక్కన ఉన్న అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో 65 ఏళ్ల బెజవాడ త్రివేణి తన కుటుంబంతో నివసిస్తోంది. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైంది. ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం తాడేపల్లిలోని వైద్యశాలకు పంపారు. వన్‌టౌన్ పోలీసులు త్రివేణి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.